## క్లుప్తంగా

### ఇదేమి సభ..

• తిట్టుకుంటూ వెనుదిరిగిన జనాలు



రాత్రి 9 గంటలైనా సభ ప్రారంభం కాకపోవడంతో వెనుదిరుగుతున్న జనాలు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కూటమి సభకు విచ్చేసిన జనాలు నాయకులను తిట్టుకుంటూనే సభ ప్రారంభం కాక ముందే మూడొంతుల జనాలు వెనుదిరిగారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కావాల్సినన సభకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాత్రి 9 అయినా రాకపోవడంతో జనాలు విసుగుచెందారు. తెలుగుదేశం పార్టీ నాయకులిచ్చే వంద, రెండొందలకు నాలుగు గంటలు వేచి చూడడమే గొప్ప అనుకుంటూ వెళ్లిపోయారు. దీంతో ప్రజలను తీసుకువచ్చిన నాయకుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సభకు వచ్చిన 5 వేల మందిలో సగం మంది వెళ్లిపోవడం విశేషం.

### సెంచూరియన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ, ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి బుధవారం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సీఎస్ఆర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతను వీసీతో పాటు సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ శైలజ, డీన్ సన్నీడియోల్, ఎన్‌సీసీ అధికారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత ఆలోచనలు తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ శామ్యూల్ రాజు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో పైకి ఎదగాలని ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ ఎన్. శామ్యూల్‌రాజు పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఎంబీఏ విద్యార్థులకు వ్యాపార అవకాశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శామ్యూల్ రాజు మాట్లాడుతూ... విద్యార్థులు తమ జీవనశైలి, ఆలోచనా దృక్పథంపై సరైన అవగాన కలిగి ఉండాలన్నారు. కాలం విలువ తెలుసుకుని విజ్ఞతతో ముందుకు సాగితే అందరికీ అవకాశాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సెంచూరియన్ వీసీ పీకే మహంతి, సిబ్బంది పాల్గొన్నారు.

### బాల కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరం

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని బాల కేంద్రంలో 'సృజనాత్మక వేసవి శిక్షణ' శిబిరాన్ని బుధవారం ప్రారంభించామని బాల కేంద్రం ప్రర్యవేక్షకుడు బుర్రా శ్రీనివాసరావు తెలిపారు. శాస్త్రీయ గాత్ర సంగీతం, భక్తి సంగీతం, శాస్త్రీయ భరతనాట్యం, దేశభక్తి, జానపత నృత్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తరగతులకు 5 నుంచి 16 సంవత్సరాల వయసు విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రవేశాల కోసం 94415 72195 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

### ప్రాణం నిలిపిన సర్వజన ఆస్పత్రి వైద్యులు



డిశ్చార్జ్ చేసిన సమయంలో వైద్యులతో ఉన్న పూర్తిగా కోలుకున్న భరత్



ఆస్పత్రిలో చేరిన రోజు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న భరత్

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన ఇమంది భరత్ అనే యువకుడు ఈ నెల 11వ తేదీన పురుగులమందు తాగి కోమాలోకి వెళ్లిపోయాడు. వెంటనే వైద్యంకోసం కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగం వైద్య బృందం ఐసీయూలో చేర్పించి వెంటిలేటర్‌పై 8 రోజుల పాటు చికిత్స అందించారు. కొద్దిగా కోలుకున్న జనరల్ వార్డులో మరో 5 రోజుల పాటు చికిత్స అందించి బుధవారం డిశ్చార్జ్ చేశారు. కుమారుడి ఆయుష్షు పోసిన వైద్యులు సుదర్శి, బోళం పద్మావతి, గౌతమ్, ఉదయ, నర్సింగ్ సిబ్బందికి భరత్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# జోరుగా.. హుషారుగా...

• జిల్లా కేంద్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఎన్నికల ప్రచారం
• అడుగడుగునా బ్రహ్మారథం పడుతున్న ప్రజానీకం



అయ్యన్నపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా డిప్యూటీ స్పీకర్, విజయనగరం శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి జోరుగా.. హుషారుగా ప్రచారం చేపడుతున్నారు. నగరంలోని 44వ డివిజన్ పరిధిలో గల అయ్యన్నపేట ప్రాంతంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను నేరుగా కలిసి సంక్షేమ, అభివృద్ధి పాలన అందించిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. పేద ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలబడాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు విజయ తిలకాలు దిద్ది హారతులు పట్టారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు సైలాడ సత్యనారాయణ, లెంక మహేష్ మాట్లాడుతూ.. కోలగట్ల వీరభద్రస్వామి ఐదేళ్లలో చేసిన కృషి మరువరానిదన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలన కొనసాగించిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకున్న వ్యక్తి కోలగట్ల అని కొనియాడారు. 44వ డివిజన్‌లో రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించారన్నారు. అలాగే రెండు వాటర్ ట్యాంక్‌లు నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చారన్నారు. మరోసారి కోలగట్లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, జోనల్ ఇన్‌చార్జ్ తమ్ము, పిన్నింటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు డాక్టర్ సంధ్య, డాక్టర్ నాగాభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

## మోసకారి ప్రభుత్వం కావాలో... మంచి చేసే ప్రభుత్వం కావాలో మీరే నిర్ణయించుకోండి



3వ డివిజన్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మాయ మాటలు చెప్పి మోసపూరిత హామీలతో ప్రజలను వంచించే ప్రభుత్వం కావాలో.... మంచి చేసే ప్రభుత్వం కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 2వ డివిజన్ పూల్‌బాగ్ కాలనీలో.. 3వ డివిజన్ వ్యాసనారాయణ మెట్టలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మరోసారి మోసకారి హామీలతో మభ్యపెట్టేందుకు వస్తున్నాడని అటువంటి వ్యక్తిని నమ్మి మోసపోవద్దని సూచించారు. తన పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని.. వాటి పరిష్కారానికి నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలను అమలు చేసిన జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పాలన సాగిందని చెప్పారు. గత ఎన్నికలకు ముందు తాగునీటి కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, వైఎస్సార్‌సీపీ హయాంలో సమస్య పరిష్కరించామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. మరోసారి శాసనసభ్యుడిగా తనను గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. నగర మేయర్ వి. విజయలక్ష్మి మాట్లాడుతూ.. గతం కన్నా నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గడప స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందబాబు మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్య కారణంగా తమ డివిజన్ వెనుకబడిన ప్రాంతంగా ఉండేదన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవతో డివిజన్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, 3వ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జ్ పిన్నింటి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

• నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు



కొండపేటలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. నగర పంచాయతీ పరిధి కొండపేటలోని 2,3 వార్డుల్లో పార్టీ నగర అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, తదితరులతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆదరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు జానా ప్రసాద్, రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, నౌపాడ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మొయిద శ్రీనివాసరావు, పైల భారతి, మైపాడ ప్రసాదరావు, చిక్కాల సంతోష్‌కుమార్, నాయకులు పైల మురళీ, బూర సత్యనారాయణ, మజ్జి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అధికార వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు సాగుతోంది. గడిచిన ఐదేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. విజయనగరం మండల పరిధిలోని ద్వారపూడి గ్రామంలోని 9,10 వార్డులకు చెందిన బొద్దుల కుటుంబ సభ్యులు, సాజు బిల్లి కుటుంబ సభ్యులు బుధవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సీఎం జగన్ మోహన్‌రెడ్డితో మజ్జి శ్రీనివాసరావు, సిరి సహస్ర



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో అవనాపు భావన, విక్రమ్



ముఖ్యమంత్రిని కలిసిన శోభా స్వాతిరాణి, గణేష్

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని జిల్లాకు చెందిన పలువురు నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం అరిణాం అక్కివలస వద్ద మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా సీఎంను కలిసి, సార్వత్రిక ఎన్నికలపై సమీక్షించారు. ఉమ్మడి విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె సిరి సహస్ర, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, పార్టీ నాయకుడు గులిపల్లి గణేష్, తదితరులు కలిశారు.

## ఎంఎస్ఎన్ కాలనీలో ఎన్నికల ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని 29వ డివిజన్ ఎంఎస్ఎన్ కాలనీ, తదితర ప్రాంతాలలో బుధవారం నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మే 13న జరగనున్న ఎన్నికలలో తన తండ్రి కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. ఐదేళ్ల పాటు ప్రజల మధ్యనే ఉంటూ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. మరోసారి అతనికి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి ఓటెయ్యాలని కోరారు. ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 27న సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యస్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి

విజయనగరం: ఈ నెల 27న సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు సుబ్రహ్మణ్య ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి అన్నారు.బుధవారం స్థానిక పూల్‌బాగ్‌లో గల వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆలయ ఆవరణలో దేశంలోనే అతి ఎత్తయిన 60 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ఉందన్నారు. 33 కోట్ల దేవతలకు అధిపతి అయిన సుబ్రహ్మణ్యస్వామికి నవగ్రహాలను శాసించే శక్తి ఉందన్నారు. సుబ్రహ్మణ్య నామ జపంతో ఎటువంటి సమస్యలైనా పరిష్కారమవుతాయని చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు 60 అడుగుల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి ఇసరపు శ్రీనివాస గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు దువ్వ శ్రీనివాసరావు, అచ్చిరెడ్డి, బెహరా కుర్మారావు, ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ, చిలకలపూడి పైడిరాజు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సుఖశాంతులు

• ప్రముఖ ధార్మికవేత్త అప్పసాని రంగారావు దొర



ఆలయ నిర్వాహకులకు రెండు కిలోల వెండి పాదాలను అందజేస్తున్న దాతలు

విజయనగరం: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని పట్టణానికి చెందిన ప్రముఖ ధార్మికవేత్త అప్పసాని రంగారావు దొర అన్నారు. పట్టణంలోని రామానాయుడు రోడ్డులో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ తల్లి అమ్మవారికి దాతలు సుమారు రెండు కిలోల వెండి పాదాన్ని తయారు చేయించారు. ఈ పాదాన్ని రంగారావు దొర అమ్మవారికి బుధవారం అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువు, కాటకాలు పోయి సమృద్ధిగా వర్షాలు పడడంతో పాటు ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ఆలయ ధర్మకర్త ఒబ్బిలిశెట్టి రామ్‌జీ మాట్లాడుతూ, కోట సత్తమ్మ తల్లికి భక్తులు వివిధ సందర్భాలలో ఇచ్చిన విరాళాలతో వెండి బాహువులు, పాదాలు, కిరీటం, 108 పుష్పాలు, తదితర ఆభరణాలు తయారు చేయించినట్లు చెప్పారు. ప్రతి ఏటా అమ్మవారి ఆలయం వద్ద పేదలకు అన్నదానం, శివరాత్రికి సహస్ర దీపార్చన, సంక్రాంతికి పేదలకు చీరల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఒబ్బిలిశెట్టి ఏడుకొండలు, ఎం. వెంకటరాజు, చెక్కా త్రినాథరావు, జి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

# అల.. విజయనగరంలో...

• ఐదేళ్లలో నగర సుందరీకరణకు పెద్దపీట
• పదవుల కోసం కార్పొరేషన్ హోదాను తాకట్టుపెట్టిన గత టీడీపీ నాయకులు
• కోలగట్ల హయాంలో పెద్ద నగరాలకు దీటుగా నగర అభివృద్ధి



ఆధునిక సొబగులు అద్దుకున్న విజయనగరం గంటస్తంభం



ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్‌లో దండి మార్చ్ విగ్రహాలు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో విజయనగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. 2014 ఎన్నికల అనంతరం విజయనగరానికి కార్పొరేషన్ హోదా దక్కగా.. అప్పటి పాలకులు తమ పదవుల కోసం ఆ ఉత్తర్వు అభియన్స్‌లో పెట్టి అభివృద్ధిని అణిచివేసిన విషయం అందరికీ విదితమే. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల విజయనగరాన్ని కార్పొరేషన్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయించారు. కార్పొరేషన్ పరిధిలో శత, ద్విశత శంకుస్థాపనలు పేరిట అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వాటిని ప్రారంభోత్సవాలు కూడా చేశారు. గత టీడీపీ హయాంలో అసంపూర్తిగా ఉన్న రహదారులను సైతం పూర్తి చేస్తున్నారు.

**అన్ని రంగాల్లో..**

కళలకు కాణాచిగా పేరుగాంచిన సాంస్కృతిక రాజధాని విజయనగరంలో ఒకప్పుడు నగరం నడిబొడ్డున గల కోట, గంటస్తంభం మాత్రమే దర్శనమిచ్చేవి. 2019 ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కూడలీ ఓ చారిత్రక ప్రదేశంగా దర్శనమిస్తున్నాయి. స్వాతంత్ర్య వైభవాన్ని చాటి చెప్పేలా దండి మార్చ్, ఆధునిక సొబగులు అద్దుకున్న గంటస్తంభం, నగర వ్యాప్తంగా మిరుమిట్లు గొలిపే సెంటర్ లైటింగ్, ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న ప్రధాన కూడళ్లు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

**సుందరీకరణ పనులు..**

- రూ.8 లక్షలతో గోకుల్ పార్క్ అభివృద్ధి
- రూ.13.98 లక్షలతో గురజాడ సర్కిల్ సుందరీకరణ
- రూ.13.05 లక్షలతో అంబేద్కర్ జంక్షన్ అభివృద్ధి
- రూ.30 లక్షలతో ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దండి మార్చ్
- రూ.17.57 లక్షలతో ఎత్తుబ్రిడ్జి సుందరీకరణ
- రూ.47.35 లక్షలతో జ్యోతిరావుపూలే కూడలి అభివృద్ధి
- రూ.11.76 లక్షలతో ఎన్‌టీఆర్ జంక్షన్ అభివృద్ధి
- రూ. 8 లక్షలతో మయూరి జంక్షన్‌లో ప్రజలను ఆకట్టుకునేలా కప్ అండ్ కెటిల్ ఏర్పాటు
- రూ.36 లక్షలతో మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- రూ.31 లక్షలతో మయూరి జంక్షన్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు




రైల్వేస్టేషన్ రోడ్‌లో సెంటర్ లైటింగ్



సింహాచలం మేడ నుంచి బాలాజీ జంక్షన్‌కు వెళ్లే రోడ్డు



పర్యాటకులను ఆకట్టుకుంటున్న అచంటా గార్డెన్స్





నగరంలోని ఎత్తు బ్రిడ్జి జంక్షన్



పర్యాటకులను ఆకట్టుకుంటున్న నేమ్ బోర్డులు



ఆహ్లాదాన్ని పంచేలా దాసన్నపేట- జమ్ము ప్రధాన రహదారి